సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శనివారం । 12 । ఏప్రిల్ । 2025


తలంబ్రాల క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

చూసిన కనులదే భాగ్యం

నీలిమేఘ శ్యాముడు.. రఘుకుల సోముడు.. శ్రీరామచంద్రుడు.. కల్యాణ రాముడిగా మారి.. సౌందర్య రాశి.. సుగుణాల తల్లి సీతమ్మను పరిణయమాడారు. నునుసిగ్గుల మొలకైన సీతమ్మకు నుదుటన కల్యాణ బొట్టు, బుగ్గన కాటుక పెట్టి.. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పట్టువస్త్రాలను అలంకరింపజేశారు. కోదండ రాముడు సర్వాభరణ భూషితుడై ఆశీనులయ్యారు. భక్తుల రామనామ సంకీర్తనలు.. వేద పండితుల చతుర్వేద పఠనం.. మంగళవాయిద్యాల నడుమ.. అర్చకులు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని కల్యాణాన్ని శుక్రవారం రాత్రి వెన్నెల్లో నయనానందకరంగా నిర్వహించారు. చూసిన కనులదే భాగ్యం అన్నట్లుగా వేడుక సాగింది.

- కమనీయంగా సీతారాముల కల్యాణం
- వైకుంఠాన్ని తలపించిన ఏకశిలానగరి
- పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన రామనామం


ఒంటిమిట్టలో సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు


పాల్గొన్న అశేష భక్తజనం

రాజంపేట/ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారామ కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఏకశిలానగరం రామనామంతో మార్మోగింది. దారులన్నీ భక్తులతో రద్దీగా మారిపోయాయి. జిల్లా నలు మూలల నుంచి కాకుండా పక్క జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా రామాలయంలోని సీతా,రామ,లక్ష్మణ మూర్తులను ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. కోదండ రామయ్య సీతమ్మవారిని పరిణయం ఆడిన వేల శిల్పకళాశోభితమైన కల్యాణ మండపం వైకుంఠాన్ని తలపించింది.

సంప్రదాయం.. ఎదుర్కోలు ఉత్సవం

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీతారామచంద్రులకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. ఉత్సవ వరులను పల్లకీపై కొలువు దీర్చారు. ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేదిక పైన రంజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఆశీనులు చేశారు. అనంతరం పూజా సామగ్రిని సంప్రోక్షణ జరిపి ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా విశ్వక్సేన పూజ నిర్వహించారు. 'కర్మణ్యేపుణ్యాహవచనం' అనే మంత్రంతో మండప శుద్ధి జరిపి కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. బంగారు ఆభరణాలను సీతమ్మకు అలంకరించి సకలోపచారాలు చేశారు. మధుపర్కపాసన అనంతరం పెరుగు, తేనె కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించగా.. సీతమ్మ నొసటన కల్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టి చుక్క పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్పించిన ముత్యాలతలంబ్రాలు, పట్టువస్త్రాలను ధరించి పెళ్లికూతురిగా ముస్తాబైంది. ఆమెకు ఏ మాత్రం తీసిపోని విధంగా శివధనుస్సు విరిచిన శ్రీరామచంద్రమూర్తి.. అదే రీతిలో సర్వాభరణ భూషితుడై సీతమ్మ ఎదుట కూర్చున్నారు. తరువాత లోక క్షేమం కోసం మహా సంకల్పం పఠించి కన్యాదానం , గోదానం చేశారు. సీతమ్మకు రామయ్యకు చెరో 8 శ్లోకాలతో మంగళాష్టం చదివారు. హస్త నక్షత్రయుక్త శుభ లగ్నంలో 6:30 నుంచి 8:30 గంటల మధ్య సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం గౌరిదేవి, సరస్వతిదేవి, మహాలక్ష్మీ అమ్మవార్లను ఆహ్వానం చేసి సకల మంగళాలకు ఆలవాలమైన మంగళసూత్రానికి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర వేదపండితులు మంగళసూత్రాన్ని భక్తులకు చూపించారు. సాక్షాత్తూ లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత, శ్రీ మహాలక్ష్మీ స్వరూపిణి సీతాదేవికి శాస్త్రోక్తంగా మంగళసూత్రధారణ నిర్వహించారు. ప్రభుత్వం తెచ్చిన ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సుపై వేసి కల్యాణం జరిపారు. అనంతరం నివేదన ఇచ్చి బ్రహ్మముడి వేశాక మహాదాశీర్వచనం నిర్వహించి హారతి ఇవ్వడంతో కల్యాణ క్రతువు ముగిసింది.

వేదిక.. సుందర దీపిక

కల్యాణ వేదికను టీటీడీ ఉద్యానవ విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతా యుగం నాటి జనకపురిని గుర్తుకు తెచ్చేలా సుందరంగా ముస్తాబు చేశారు. వేదికపై ప్రాచీన ఆలయాలలోని కళాకృతులు, దశావతరాల సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వరిగింజలతో మండపం ఏర్పాటు చేశారు. రంగురంగుల పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. చెరుకులు, టెంకాయ గెలలు, టెంకాయ పూత, అరటి ఆకులు, మామిడాకులు, హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం, ఆర్కిడ్, రెడ్ ఆంధూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో అలంకరించారు. ఇందుకోసం 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండు రోజుల పాటు 120 మంది అలంకరణ నిపుణులు, 120 మంది టీటీడీ సిబ్బంది ఇందుకోసం పని చేశారు.

గజవాహనంపై కల్యాణ రాముడు

ఒంటిమిట్ట: శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి కల్యాణోత్స వం అనంతరం గజవాహనంపై కల్యాణరాముడు భక్తుల దర్శనమిచ్చారు. 9.30 నుంచి 10.30 వరకు స్వామివారు ఆలయ మాఢ వీధుల్లో విహరించారు. రాములోరి కల్యాణోత్సవం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పోలీసులు అమలు చేసిన అంక్షలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు భక్తులు కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

శివధనుర్భంగ అలంకారంలో...

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివధనుర్భంగ అలంకారంలో స్వామివారు విహరించారు. చెక్కభజనలు, కేరళవాయిద్యాలు, కోలటాల నడుమ ఊరేగింపు కొనసాగింది. భక్తులుఅడుగడునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరిండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో సీఎం బస

ఒంటిమిట్టలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి బసచేశారు. ఈ సందర్భంగా సీఎంను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు కలిసి మాట్లాడారు.


స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న వేద పండితులు


సీఎం చంద్రబాబు దంపతులను సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్


శివధనుర్భంగ అలంకారంలో స్వామివారి ఊరేగింపు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శిగా జి.గురుమూర్తి, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా డి.ఆదిత్య రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శులుగా బి.సందీప్‌కుమార్‌రెడ్డి, వి.రామలక్ష్మణ్ రెడ్డి, రాష్ట్ర మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా సి.సంజీవయ్య, కార్యదర్శిగా ఎల్.చంద్ర ఓబుల్ రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా బీఎస్ జాన్, సంయుక్త కార్యదర్శిగా జె.రవికుమార్‌ను నియమించారు.

16లోపు అభ్యంతరాలు తెలపాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాల్లోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు(గవర్నమెంట్) తాత్కాలిక జాబితా వెబ్‌సైట్ https:/rjdsekadapa.blogspot.comలో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలిపారు. కావున ఏవైనా అభ్యంతరాలు ఉన్నచో సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో తగిన ఆధారాలతో ఈ నెల 16లోపు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

21న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలోని మోడల్ స్కూల్స్(ఆదర్శ పాఠశాలలు)లో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ పరీక్షను ముందుగా ఈనెల 20న నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందని, అయితే 20వ తేదీ ఆదివారం, ఈస్టర్ పండుగ కావడంతో 21కి మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని కోరారు.

వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, చిత్రంలో మత పెద్దలు, నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న ముస్లింలు

- సుదీర్ఘ ఉద్యమానికి వెనుకాడబోము
- ముస్లింల నిరసన ప్రదర్శనలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్: ముస్లింల హక్కుల పరిరక్షణను కాలరాస్తున్న వక్ఫ్ సవరణ చట్టం రద్దయ్యే వరకు పోరాడుతామని, అవసరమైతే సుదీర్ఘ ఉద్యమానికి వెనుకాడేది లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక ఏడురోడ్ల కూడలిలో ముస్లింలు పెద్ద ఎత్తున హాజరై నల్లచట్టాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంజద్‌బాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను దుయ్యబట్టారు. ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న ఈ బిల్లులకు ఏయే పార్టీల వారు మద్దతు ఇచ్చారో అందరికీ తెలుసన్నారు. ముస్లింలకు మద్దతుగా ఉంటామన్న కూటమి ప్రభుత్వం ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోని నాయకులు వెంటనే రాజీనామాలు చేసి నల్లచట్టాలకు వ్యతిరేకంగా తమ ఉద్యమానికి కలిసి రావాలని కోరారు. సెక్యులర్ భావాలు గల ప్రతి పౌరుడు ఈ చట్టాలను తీవ్రంగా నిరసించాలన్నారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తూ దేశంలో ముఖ్య భాగమైన ముస్లింలకు వ్యతిరేకంగా ఈ బిల్లును తీసుకు రావడం వెనుక అంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం ఈ ఒక్కరోజు చేస్తే సరిపోదని, సమస్య పరిష్కారం అయ్యేవరకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ముస్లింలందరూ తమలోని విబేధాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. నిరసన ప్రదర్శనలో నల్లజెండాలతోపాటు నల్లరిబ్బన్లు, జాతీయ జెండాలు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత గురువులు, ముస్లిం ప్రముఖులు కూడా తమ నిరసన వ్యక్తం చేస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు, ఉలేమా అయిమ్మ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు సుబాన్‌బాషా, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజమ్, డాక్టర్ గౌస్‌పీర్, డీసీసీ మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నేత అలీఖాన్, ధర్మ ప్రచారకులు బాబుభాయ్, సంఘ సేవకులు సలావుద్దీన్, కాల్‌టెక్స్ హఫీజుల్లా, మైనార్టీ కార్పొరేటర్లు, నగర ముస్లింలు పాల్గొన్నారు.

'సాక్షి' ఎడిటర్‌పై తప్పుడు కేసు ఉపసంహరించుకోవాలి

ఏపీయూడబ్ల్యూజే నాయకుల డిమాండ్


డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితోపాటు మరో ఆరుగురిపై డీజీపీ ఆదేశాల మేరకు పోలీసులు నమోదు చేసిన తప్పుడు కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోపూరి బాలకృష్ణారెడ్డి, సాక్షి టీవీ జిల్లా ప్రతినిధి వెన్ను శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు ఈ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు జిల్లా మాచర్లలో హరిశ్చంద్ర అనే వ్యక్తి హత్య కేసును బాధితుల కథనం మేరకు సాక్షి దినపత్రికలో ప్రచురించారని పేర్కొన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదును విచారణ చేయకుండానే డీజీపీ కేసు నమోదు చేయించారని అన్నారు. పల్నాడు పోలీసులు నమోదు చేసిన కేసు పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఉందన్నారు. డీజీపీ ఇలాంటి తప్పుడు ఫిర్యాదులపై ఆగమేఘాల మీద స్పందించడం మాని వాస్తవాలను తెలుసుకున్న తర్వాత చర్యలు తీసుకుంటే రాష్ట్ర పోలీసుల గౌరవం పెరుగుతుందన్నారు. నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవడం ద్వారా రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను కాపాడుతామన్న సంకేతాలను సమాజానికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు బీవీ నాగిరెడ్డి, నూర్‌బాషా, శ్రీనివాసులతో పాటు పలువురు పాత్రికేయులు, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన ఉరుసు

- ఘనంగా జెండా ఊరేగింపు
- భారీగా పాల్గొన్న భక్తజనం


ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు

కమలాపురం: పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి (ముతవల్లి), సజ్జాద్-ఏ-నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్త జన సందోహం నడుమ శుక్రవారం సాయంత్రం ప్రారంభం అయ్యాయి. గంధం ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో నషాన్ జెండాను ఊరేగింపుగా తీసుకు వచ్చారు. జెండా ఊరేగింపు తాళిం, మార్కెట్, చౌక్ సెంటర్ మీదుగా పెద్ద దర్గాకు చేరుకుంది. ఊరేగింపులో ప్రత్యేక డప్పు కళాకారుల వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన బాణా సంచా పెద్ద ఎత్తున పేల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నషాన్ జెండాను దర్గా ఆవరణలో ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ ఉరుసు ఉత్సవాల ప్రారంభానికి సూచిక. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనుల సమక్షంలో హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, దస్తగిరిషా ఖాద్రి, మౌలానా మౌల్వి మొహిద్దీన్ షా ఖాద్రి, హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రిల మజార్లపై పూల చాదర్‌లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా చేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా ఖాద్రి, గౌస్ పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి టి.హాసేన్‌మియా కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు గంధం: కమలాపురం పెద్ద దర్గాగా విరజిల్లుతున్న దర్గా-ఏ-గఫారియా ఖాదరియాలో శనివారం రాత్రి గంధం మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి ప్రముఖ ఖవ్వాల్‌ల మధ్య గొప్ప ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు.


నషాన్ జెండా ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గంధోత్సవాన్ని తిలకించడం శుభదాయకం

ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధోత్సవాన్ని తిలకించడం శుభదాయకం అని పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉరుసు ఉత్సవాల్లో గంధోత్సవం అతి ముఖ్యమైన ఘట్టం అని, ఈ ఘట్టాన్ని భక్తులందరూ తప్పక వీక్షించాలన్నారు. అలాగే ఈ గంధం స్వామి వారి మజార్లపై ఎక్కించడంతోపాటు తమ ఇళ్లకు తీసుకెళితే ఉన్న రోగాలన్ని నయం అవుతాయన్నారు. అలాగే ఇంటి సమస్యలన్ని తీరుతాయని, సిరి సంపదలు పెరుగుతాయని ఆయన భక్తులకు సూచించారు.

క్లుప్తంగా

చౌకదుకాణం సీజ్

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని శీలంవారిపల్లె గ్రామంలోని చౌకదుకాణాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ ఆధ్వర్యంలో రేషన్ షాపును తనిఖీ చేయగా అందులో 4897 కేజీల బియ్యం, 128 కేజీల చక్కెర తక్కువగా ఉన్నట్లు గుర్తించి సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు రేషన్ షాపును సీజ్ చేసినట్లు డీటీ తెలిపారు. ఈ దాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతాప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : జిల్లాలోని అర్హులైన ఎస్సీ వర్గాలకు చెందిన అభ్యర్థులు బ్యాంకుల అనుసంధానంతో అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మీ సేవ ద్వారా పొందిన ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అలాగే విద్యార్హతలు, పథకం మంజూరుకు కావలసిన అనుభవం తదితర సర్టిఫికెట్స్‌ను తీసుకొని ఏపీ ఓబీఎంఎస్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి మే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు రిజిస్ట్రేషన్‌తోసహా అన్ని సేవలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : రిజిస్ట్రేషన్‌తోసహా అన్ని సేవలను శనివారం పొందవచ్చునని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈనెల 12వ తేదీ రెండవ శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30గంటల కడప జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయాల్లో అన్ని సేవలు అందుతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి రిజిస్ట్రేషన్‌తో సహా అన్ని సేవలు పొందాలన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మైదుకూరు : మండలంలోని జీవీ సత్రం సమీపంలో శుక్రవారం సాయంత్రం గూడ్స్ వాహనం ఢీకొని చుక్కా శ్రీనివాసులు అలియాస్ పెద్ద మూగెన్నకు గాయాలయ్యాయి. ఎస్.ఎర్రబల్లె పంచాయతీ జ్యోతినగర్‌కు చెందిన శ్రీనివాసులు కూలి పనులకు వెళ్లి ఇంటికి వెళుతుండగా శ్రీరాంనగర్ వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన గూడ్స్ వాహనం ఢీకొంది. సంఘటనలో బాధితునికి రెండు కాళ్లకు గాయాలయ్యాయి. బంధువుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఈనెల 9వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి (55) తీవ్ర అనారోగ్యంతో చేరాడు. పరిస్థితి విషమించడంతో వైద్యసేవలను పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతని ఆచూకీ కోసం ఎవరైనా వుంటే తగిన ఆధారాలతో తమను నేరుగా సంప్రదించాలని వైద్యులు కోరారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో వుంచారు.

రిమ్స్‌లో ఫార్మసిస్ట్‌పోస్టు భర్తీకి పైరవీలు

- కాంట్రాక్ట్ పోస్టులో రెగ్యులర్ ఉద్యోగి భర్తీకి యూనియన్ నాయకులు అధికారులపై ఒత్తిడి
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్న పాలనా విభాగా సిబ్బందికి బెదిరింపులు
- ఇందుకోసం 'పరిపాలనా విభాగం'లో కొందరి సహకారం?



కడప రిమ్స్ ఓపీ విభాగం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కడప గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్)లో రెగ్యులర్ ఫార్మసిస్ట్- గ్రేడ్-2ను, ఫార్మసిస్ట్ కాంట్రాక్ట్ పోస్టులో నియమించమని యూనియన్ నాయకులు ఒత్తిడి తెస్తున్నారనీ అరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందుకోసం యూనియన్ నాయకులు రూ. 5- 8 లక్షల వరకు వసూలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రెగ్యులర్ ఉద్యోగిని నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ పోస్టులో ఉద్యోగిని నియమిస్తే జీతాలు సమస్య ఎదురవుతుందని తర్వాత భవిష్యత్తులో కాంట్రాక్టు ఉద్యోగి జాయిన్ అయితే రెగ్యులర్ ఉద్యోగస్తుని బయటికి వెళ్లాల్సి వస్తుంది. నిబంధన ప్రకారం కాంట్రాక్టు ఫార్మసీ పోస్టులో రెగ్యులర్ ఉద్యోగులకు పోస్టింగ్ లేదా బదిలీ ఇచ్చుట నిబంధనలకు విరుద్ధమని రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ వివరణతో యూనియన్ నాయకులు సంతృప్తి చెందలేదు. పైరవీలకు అలవాటు పడిన అధికార పార్టీ పేరుతో చలామణి అవుతున్న కొందరు యూనియన్ నాయకులు రిమ్స్ సిబ్బందిని చివరికి బెదిరింపు ధోరణికి పాల్పడిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈసంఘటన వివరాల్లోకెళితే ..ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడిసీ)సెంట్రల్ ట్రక్ స్టోర్‌లో వి.ఎన్‌పల్లి నుంచి డిప్యుటేషన్ లో ప్రస్తుతం ఓ రెగ్యులర్ ఉద్యోగి విధులను నిర్వహిస్తున్నారు. అతను తన మాతృశాఖకు వెళ్లుటకు సరెండర్ అయ్యారు. సరెండర్ అయిన ఉద్యోగి జిల్లా లోని ఏ పిహెచ్‌సీ లో పోస్టు ఖాళీగా ఉన్న కూడా పల్లెల్లో పోయి డ్యూటీ చేయుటకు ఇష్టం లేక రిమ్స్ జనరల్ హాస్పిటల్‌కు బదిలీ కావాలని ప్రయత్నించారు. యూనియన్ వారితో ఒక రేటు మాట్లాడుకుని ప్రయత్నాలు మొదలుపెట్టారు.. యూనియన్ నాయకులలో కొందరు సొంత లాభం ఆలోచించి రిమ్స్ సూపరింటెండెంట్ సంప్రదించారు. కాంట్రాక్ట్ పోస్ట్‌లో రెగ్యులర్ ఉద్యోగిని నియమించడం లేదా బదిలీ చేయడం డిపార్ట్‌మెంట్ నియమ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. సదరు యూనియన్ లీడర్స్ సిబ్బందిని బెదిరించి జీతాలు విషయంలో మిగతా ఏ సమస్యలనైనా డీఎంఈ కార్యాలయం లో తమకు సహకరించు అధికారులు ఉన్నారు. డీఎంఈ ఇంకా పైస్థాయిలో మేం చూసుకుంటాము మీరు క్లారిఫికేషన్ రాయండి అని ఒత్తిడి చేశారు. అయినా రిమ్స్ సూపరింటెండెంట్ మొత్తం రిమ్స్ లో ఫార్మసిస్టులు పోస్టులు 11. రెగ్యులర్ ఉద్యోగులు 11 మంది పనిచేస్తున్నారని, 10 కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్ పోస్టులకు 9 మంది పని చేస్తున్నారని ఇటీవల ఒక కాంట్రాక్టు ఉద్యోగి రిజైన్ చేయడం వల్ల ఒక ఖాళీ ఏర్పడిందిదని, ఆ పోస్టు కాంట్రాక్ట్ పోస్ట్ మాత్రమే అని క్లారిఫికేషన్ ఆర్డీకి లెటర్ పెట్టారు. ఈ విధానానికి యూనియన్ నాయకులు సంతృప్తి చెందలేదు. కోర్టును ఆశ్రయిస్తామని రిమ్స్‌లో అధికారులను, సిబ్బందిని బెదరించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. యూనియన్ నాయకులు తమ స్వార్థాలకు సమూహంగా ఏర్పడి చేసే మోసాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అధికారులు వీరి బెదిరింపులకు లొంగవద్దని పలువురు ఉద్యోగస్తులు కోరుకుంటున్నారు. ఈ సంఘటనలో జీజీహెచ్‌లోని ఓ మహిళా సీనియర్ అసిస్టెంట్ యూనియన్ నాయకుల బెదరింపులకు బెంబేలెత్తి పోయింది. మరోవైపు జీజీహెచ్(రిమ్స్)లో ఫార్మసీ విభాగంలోనే పనిచేస్తున్న రెగ్యులర్ మహిళా ఉద్యోగి ఈనెలలోనే రిటైర్డ్ కాబోతుందని సమాచారం. ఆమె స్థానంలో కూడా సదరు 'ఫార్మసీ ఆఫీసర్'ను నియమించేందుకు కూటమి అధికారపార్టీకి సన్నిహితంగా వుంటున్న పై యూనియన్ నాయకులు ప్రయత్నాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలి

అనంతపురం జేఎన్‌టీయూ వీసీ హెచ్.సుదర్శనరావు



కళాశాల అకడమిక్ మెరిట్ అవార్డులను అందిస్తున్న వీసీ హెచ్.సుదర్శనరావు

పులివెందుల రూరల్ : విద్యార్థులు ఉద్యోగం సంపాదించడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని అనంతపురం జెఎన్‌టీయూ వైస్ చాన్సలర్ హెచ్.సుదర్శనరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతపురం వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ హెచ్.సుదర్శనరావు స్వీయ అభ్యసన అవగాహన, నైపుణ్యాభివృద్ధి గోల్ సెట్టింగ్, అకడమిక్ క్రెడిట్ డిపాజిట్ స్కీం, మల్టీ డిసిప్లినరీ, ఇంటర్ డిసిప్లినరీ, సాంకేతికత, వ్యాల్యూ ఆడెడ్ కోర్సులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సబ్జెక్టు విషయాలపైనే కాక సాంకేతిక నైపుణ్యత, విలువలు, విద్యా సృజనాత్మకతతో వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధిని సంపాదించి కళాశాలను అగ్రస్థానంలో ఉంచాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య డి.విష్ణువర్ధన్ కళాశాల వార్షిక అభివృద్ధి, విద్యా రంగాలలో సాధించిన ప్రగతిని వివరించారు. అలాగే వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శేష మహేశ్వరమ్మ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, 2020లో విద్యా ఆవశ్యకతను తద్వారా సాధించదగిన ప్రగతిని వివరించారు. స్పోర్ట్స్ ఇంచార్జ్ డాక్టర్ ఏ. దామోదర్ రెడ్డి విద్యార్థులు క్రీడా రంగాలలో సాధించిన ప్రగతిని వివరించారు. కళాశాల అకడమిక్ మెరిట్ అవార్డులను, క్రీడా అవార్డులను విజేతలకు బహుకరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగి వేమన విశ్వవిద్యాలయానికి స్వర్ణ పతకం

59 కేజీల విభాగంలో పతక సాధించిన విద్యార్థి మురళీకృష్ణ



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన మురళీకృష్ణ

కడప ఎడ్యుకేషన్ : కాశ్మీర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో యోగి వేమన విశ్వవిద్యాలయంకు స్వర్ణ పతకం లభించింది. విద్యార్థి డి.మురళీకృష్ణ 59 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. యోగి వేమన విద్యాలయానికి ఈ పతకం ఐదవది. గత ఏడాది విశ్వవిద్యాలయానికి బంగారు పతకం సాధించడంతో వైవియూ క్రీడా బోర్డు ద్వారా రూ.30 వేల క్యాష్, ప్రతినెలా పదివేల రూపాయల పారితోషకం అందజేశారు. తద్వారా మంచి పోషకాలతో ఆహారం తీసుకోవడంవల్ల తాజాగా బంగారు పతకాన్ని డి.మురళీకృష్ణ సాధించారు. మురళీకృష్ణ ఈ పోటీల్లోనే కాక అంతర్జాతీయ క్లాసికల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో ప్రపంచ రికార్డు సాధించడం గమనార్హం. ఈ పథకం సాధించిన అతడిని ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్ రఘునాథరెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కే రామసుబ్బారెడ్డి, వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగ సిబ్బంది అభినందనలు తెలియజేశారు

అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు



భారీ టిప్పర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి చెరువులో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే వారు ఇష్టానుసారం చెరువులోని మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలానికి కూతవేటు దూరంలో ఉన్న మున్నెల్లి చెరువు నుంచి గత ఆరు నెలలుగా గుత్తేదారులు ఇష్టానుసారంగా భారీ ప్రొక్లెయిన్‌లు టిప్పర్లతో మట్టిని తవ్వుతుండటంతో చెరువు సుమారు పది అడుగుల లోతులోకి వెళ్ళిపోయింది. ఆయకట్టు కంటే చెరువు లెవల్ పది అడుగుల లోతులో ఉండటంతో వర్షాకాలంలో వచ్చే వర్షపునీరు గోతుల్లోకి సరిపోతుంది తప్ప ఆయకట్టు చెరువులకు అందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ ఆయకట్టు చెరువు కింద వర్షపునీరు కంటే ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు నీటి మీదనే ఆధారపడి ఆయకట్టు రైతులు పంటలను సాగు చేస్తారు. పది అడుగుల లోతు గోతులు తవ్వడం కారణంగా ఎల్ఎస్‌పీ నుండి వచ్చే కొద్దిపాటి నీరు గోతులకే సరిపోతుంది తప్ప ఆయకట్టుకు నీరందడం కష్టమని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఆయకట్టు చెరువును పరిశీలించి ఎంతో విలువైన ఆయకట్టు చెరువును కాపాడాలని మున్నెల్లి, టమటంవారిపల్లె, తువ్వపల్లె గ్రామాల రైతులు కోరుతున్నారు.

జ్యోతిరావు పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శం

అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్ బాబు



పూలే జయంతి సందర్భంగా నివాళులను అర్పిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శమని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్ బాబు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కె. ప్రకాష్ బాబు మాట్లాడుతూ పూలే సామాజిక తత్వవేత్తగా సమాజంలో అనేక విధాలుగా ప్రజలను చైతన్యం పరిచారని, ప్రజలలో అనాదికాలంగా పాతుకుపోయిన వివక్షలను నిర్మూలించుటకు తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. వితంతు పునర్వివాహం గురించి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడని, ప్రపంచానికే జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య గారు, ఏ.ఆర్ డి.ఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్.ఐ లు ఆనంద్, టైటాస్, వీరేష్,శ్రీశైల రెడ్డి, శివరాముడు, ఆర్.ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆవాజ్, మైనార్టీ నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసి రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ, సమానత్వాన్ని కాపాడాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్‌బాషా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ సత్తార్, అన్వర్‌బాషా పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఫాతిమా మసీదు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముస్లిం మైనార్టీలపై అనేక రకాలుగా దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ఆ క్రమంలోనే వక్ఫ్ చట్టసవరణ బిల్లును తెరమీదకు తీసుకువచ్చిందని అన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని ప్రపంచానికి చాటిన ప్రజల మధ్య మతోన్మాద పార్టీలు చిచ్చు పెట్టడం దారుణమన్నారు. కేంద్రం వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కరీముల్లా, హసన్, షరీఫ్, రసూల్, షంషీర్, ఇబ్రహీం, హబీబ్, మస్తాన్, ఆయుబ్, ఖలీల్, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

చిన్నారుల కోసం శిశుగృహలో సంప్రదించండి



బాలల సంక్షేమ సమితిలో ఉన్న చిన్నారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో సాకేత్ (3), మల్లి (2) అనే చిన్నారులు ఉన్నారని తెలియడంతో ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్ వైజర్, మహిళా పోలీసులు చిన్నారులు తీసుకుని సీడబ్ల్యూసీ ఎదుట హాజరు పరిచామని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉన్నట్లయితే బాలల సంక్షేమ సమితిలో సంప్రదించి తీసుకు వెళ్లాలన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



నిరసన తెలుపుతున్న బీఎస్పీ, ఇతర సంఘాల నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణన నిర్వహించకుండా వారి ఓట్లతో అధికారం చలాయిస్తూ తీవ్ర అన్యాయానికి పాల్పడుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప విమర్శించారు. చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబయ్య, డీఎస్ జయరాం, బీసీ రమణ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి వేదిక అధ్యక్షుడు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్, నాగేంద్ర, దళిత మిత్ర సంఘం అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మహిళ వేడుకోలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అన్నమయ్య జిల్లా రాజంపేట డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ సంజీవరాయుడు సతీమణి బి.కృష్ణవేణి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. శుక్రవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలిసి ఆమె వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తన భర్త ఇటీవల రూ. 1.50 లక్షలు అప్పు చేశాడని, అప్పు ఇచ్చిన వారు ఇంటి వద్దకు వచ్చి డబ్బుల కోసం మాట్లాడుతుండడంతో భర్తను ప్రశ్నించగా తమ ఉన్నతాధికారికి డబ్బులు ఇచ్చానని తెలిపారన్నారు. చిన్నచిన్న తప్పులకు కూడా ఆ ఉన్నతాధికారి లంచాలు తీసుకుని తన భర్తను దుర్భాషలాడారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట్రాముడు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు సమీపాన పులివెందుల రోడ్డులో శుక్రవారం ట్రాక్టర్ ఢీకొని బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన వెంకట్రాముడు అరటి కాయలను లారీల లోడు నింపే కూలి పని చేసుకుంటూ పులివెందులలో నివాసముంటున్నాడు. వెంకట్రాముడు తన స్వగ్రామంలో జాతర ఉండటంతో శుక్రవారం కూలి పని తొందరగా ముగించుకొని తన స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా అంకాలమ్మ గూడూరు బలపనూరు గ్రామాల మధ్యలో ఎదురుగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్రాముడు(38) మృత్యువాతపడ్డారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

అండర్-17 సెపక్ తక్రా పోటీలకు ఏపీ జట్లు ఎంపిక

సాక్షి, అమరావతి : జాతీయ స్థాయి అండర్-17 'సెపక్ తక్రా' పోటీలకు ఏపీ జట్లు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు మణిపూర్‌లోని ఇంఫాల్ శాయ్ సెంటర్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈజట్లకు కోచ్‌గా ఎస్. రమేష్ (ఎన్టీఆర్), బాలికల జట్టు మేనేజర్గా ఎం. సంతోషి కుమారి (కర్నూలు), బాయ్స్ టీమ్ మేనేజర్ డి.సుంకర రావు (కర్నూలు) వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా జట్లను సమగ్ర శిక్షా ఎస్పీడీ అభినందిస్తూ విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు.

పెళ్లిలో విదేశీయుల సందడి



పోట్లదుర్తి పెళ్లిలో సందడి చేస్తున్న విదేశీయులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన దాసమనేని ప్రతాప్‌నాయుడు కుమార్తె ప్రవల్లిక వివాహక వేడుకలలో విదేశీయులు సందడి చేశారు. శుక్రవారం రాత్రి ఈ పెళ్లి వేడుకలు పోట్లదుర్తి గ్రామ పరిధిలోని పెన్నానది ఒడ్డున ఉన్న రెడ్ల కల్యాణ మండపంలో జరిగాయి. వేడుకకు రష్యా, థాయిలాండ్, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల నుంచి 8 మంది విదేశీయులు వచ్చారు. వారం రోజులుగా జరుగుతున్న మోహందీ, హల్దీ, సంగీత్ పెళ్లి కుమార్తె అలంకరణ తదితర కార్యక్రమాలో ఉత్సహగా పాల్గొని వేడుకలను తిలకించి సందడి చేశారు.

ఎండిన 'డొక్కల మడుగు'

– ప్రమాదంలో వన్యప్రాణులు

కడప కల్చరల్ : వైఎస్సార్ కడప జిల్లా నల్లమల అటవీ ప్రాంతం గంగసపల్లె రిజర్వు ఫారెస్టులోని డొక్కలకొండ కిందగల డొక్కల మడుగు ఎండిపోతోంది. ఒకప్పుడు ఇక్కడ మడుగు ఉండేదనడానికి గుర్తుగా కేవలం చిన్న గుంతలో మాత్రమే నీరు కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో ఎప్పుడూ ఇలాంటి స్థితి లేదని మైదుకూరుకు చెందిన రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ శుక్రవారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలను తెలియజేశారు. ఎంతో ప్రాచీనమైన డొక్కల మడుగు ఈ ప్రాంతంలోని వన్యప్రాణులకు ప్రాణధారంగా నిలిచి ఉందన్నారు. ఈ సంవత్సరం జనవరిలో కూడా నీరు పుష్కలంగా ఉండిందని, ఫిబ్రవరి నుంచి క్రమంగా నీటిమట్టం తగ్గడం మొదలైందని, ప్రస్తుతం మార్చి చివరినాటికి పూర్తిగా నీటిమట్టం తగ్గిపోయిందని, దీంతో వన్యప్రాణులకు దాహార్తి తీరడం ఇబ్బందికరమైందని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో వీటికి మరింత క్లిష్ట పరిస్థితి ఎదుర్కోవాల్సిన ప్రమాదం ఉందన్నారు. డొక్కల మడుగు వద్ద ఎక్కువగా ఎలుగుబంట్లతోపాటు అరుదైన బంగారు నక్కలు, దుప్పులు, కొండగొర్రెలు, రేసు కుక్కలు, తోడేళ్లు, హైనాలు సంచరిస్తున్నాయని,వాటన్నింటికీ ఈ మడుగే ఆధారమని ఆయన తెలిపారు. వెంటనే ఈ మడుగుకు పూడికతీసి నీటిమట్టం పెంచేందుకు, అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని రమేష్ కోరారు. మడుగు విషయాల గురించి తనకు స్థానిక కొలుములపల్లె పంచాయతీ లింగారెడ్డిపల్లెలోని నాగమల్లారెడ్డి సమాచారం ఇచ్చారన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా స్పందించి అటవీశాఖ అధికారి సమన్వయంతో చెరువును వన్యప్రాణులను కాపాడాలని కోరారు.

ఎర్రగుంట్లలో రేషన్ రగడ

- ఎండీయూ వాహనాన్ని అడ్డుకున్న మైనార్టీ మహిళలు
- డీలర్లు, ఎండీయూ ఆపరేటర్‌కు మధ్య వాగ్వాదం
- కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ సక్రమంగా అందలేదని కార్డుదారుల ఆగ్రహం



ఎండీయూ వాహనాన్ని అడ్డుకున్న కార్డుదారులు



డీలర్లతో వాదిస్తున్న కార్డుదారులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని కార్డుదారులకు రేషన్ ఇవ్వకపోవడంతో ఎండీయూ వాహనాన్ని అడ్డుకొని మా బియ్యం మాకు ఇవ్వాలని ముస్లిం మైనార్టీ మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగారు. సుమారు మూడు గంటల పాటు డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్, కార్డుదారులకు మధ్య రగడ జరిగింది. డీలర్లే రేషన్‌ను అమ్ముకుంటున్నారని ఎండీయూ వాహన ఆపరేటర్ సులేమాన్ ప్రజలకు మీడియాకు బహిర్గతం చేశారు. అలాగే ఆపరేటర్లే చౌకదుకాణం నుంచి రేషన్ తీసుకుని పక్కదారి పట్టిస్తున్నారని డీలర్లు ఆరోపించారు. పట్టణంలోని ఎర్రచేన్, శివ టైలర్ వీధిలలోకి రేషన్ పంపిణీ చేయడానికి 6వ షాపు ఎండీయూ వాహనంలో రేషన్ తీసుకుని వెళుతుండగా మార్గ మధ్యలో మాకు రేషన్ ఇవ్వలేదంటూ 9వ షాపునకు చెందిన కార్డుదారులు మహిళలు వాహనాన్ని అడ్డుకన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతు మా 9వ షాపు డీలర్ నెలా నెలా రేషన్ సక్రంగా ఇవ్వలేదని, తూకాలలో కూడా తక్కువగా ఇస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ తీసుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

పరస్పర వాగ్వాదం.. ఆరోపణలు : డీలర్లే బియ్యం అమ్ముకుంటున్నారని ఎండీయూ ఆపరేటర్, ఎండీయూ ఆపరేటర్లే రేషన్ తీసుకుని వెళ్లి పక్కదారి పట్టిస్తున్నారని డీలర్లు ఆరోపణలు చేసుకున్నారు. ఇలా ఇరువురు పరస్పర ఆరోపణలతో గొడవ పడ్డారు. నేను అమ్ముకుంటున్న నిరూపిస్తూ నా వాహనం కాల్చి వేస్తాను అని ఆపరేటర్ సులేమాన్ సవాల్ విసిరారు. డీలర్లు మాకు బియ్యం తక్కువగా ఇస్తున్నారని, కార్డుదారులకు సుమారు 5 కిలోలు తక్కువ ఇస్తే ఎలా తీసుకుంటారన్నారు. మాకు తూకాలు కచ్చితంగా ఇస్తే మేం కూడా బియ్యం పంపిణీ చేయడానికి ఇబ్బంది ఉండదన్నారు.